సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 4 । అక్టోబర్ । 2025



ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా మారాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. -10లో



గాంధీ ఆశయాలకు తూట్లు పొడిచేలా కూటమి పాలన

గాంధీ ఆశయాలకు తూట్లు పొడిచేలా కూటమి పాలన సాగుతోందని పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -10లో

గరిష్టం/కనిష్టం
36.2/25.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 25.4 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

ముగిసిన దసరా సంబరాలు



ప్రొద్దుటూరు.. తొట్టి మెరవణిలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి



ప్రొద్దుటూరు పట్టణంలోని పుట్టపర్తి సర్కిల్‌లో భక్తుల సందడి

- చివరి రోజు వైభవంగా శమీదర్శన మహోత్సవం
- కిటకిటలాడిన కొర్రపాడు రోడ్డు

ప్రొద్దుటూరు కల్చరల్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని గురువారం విశేష అలంకారాలలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో గురువారం సాయంత్రం శమీదర్శన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విజయానికి, సకలశుభాలకు, సిరిసంపదలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని దశమినాడు ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



హిరణ్యాక్షుడిని వధిస్తున్న నరసింహస్వామి

వాసవీమాత అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో, పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి కొర్రపాడురోడ్డులోని శ్రీ వాసవీ శమీవృక్ష మండపంలో శమీదర్శన మహోత్సవం చేయించారు.

కన్నులపండువగా వాసవాంబ తొట్టిమెరవణి

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా గురువారం అర్ధరాత్రి విజయలక్ష్మీదేవి రూపంలో అమ్మవారు గ్రామోత్సవం (తొట్టిమెరవణి) కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని గజమాలలతో, ఆభరణాలతో అలంకరించి శ్రీచక్రం ఉన్న పంచలోహ హంస వాహన రథంపై ఆశీనులను చేసి పురవీధులలో వాసవీ నామస్మరణ మధ్య అట్టహాసంగా ఊరేగించారు. అమ్మవారిశాల నుంచి రాత్రి 11.55 గంటల సమయంలో ప్రారంభమైన తొట్టిమెరవణి బంగారు అంగళ్లవీధి, పప్పుల బజార్ మీదుగా 2.50 గంటల సమయంలో పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంది. అనంతరం నుంచి శివాలయం ఎదురుగా మార్కెట్‌లో రకరకాల బాణసంచా పేలుళ్లు, చెట్లు, రాకెట్లు, పాములు వంటి వాటిని పేల్చి విజయదశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. హర్యాణా కాళికామాత కళాకారుల ప్రదర్శన, కాంతార ప్రదర్శన, కేరళ సింగారి మేళం, ప్రత్యేక విద్యుత్‌దీపాల సెట్టింగ్, డూప్ కళాకారుల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు అమ్మవారి తొట్టిమెరవణిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కడపలో నగరోత్సవంలో శ్రీ విజయదుర్గమ్మ



శమీదర్శనంలో ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవికన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తి



కడపలో శ్రీ విజయదుర్గమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

న్యూస్‌రీల్

7న సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 7వ తేది ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులందరూ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

నియామకం

కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా నాగరత్నమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడికి వస్తున్నారు.

జిల్లాకు నాలుగు అవార్డులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని నాలుగు పంచాయతీలకు ఉత్తమ స్వచ్ఛ అవార్డులు లభించాయి. చెన్నూరు మండలం బయనపల్లె గ్రామం రాష్ట్ర స్థాయి ఉత్తమ స్వచ్ఛ అవార్డును దక్కించుకుంది. గోపవరం మండలం బేతాయిపల్లె, పోరుమామిళ్ల మండలం రంగసముద్రం, చాపాడు పంచాయతీలకు జిల్లాస్థాయిలో స్వచ్ఛ అవార్డులు లభించాయి.

వైఎస్సార్‌సీపీ సీఈసీ,ఎస్‌ఈసీ సభ్యుల నియామకం



దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి



డీసీ గోవిందరెడ్డి



రాజోలి వీరారెడ్డి



మాసీమ బాబు



వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి



సిద్దవటం యానాదయ్య



సొహైల్ షేక్ అహ్మద్



కె.సత్యసాయినాథ శర్మ



నల్లేరు విశ్వనాథరెడ్డి



ఎంపీ రాజారామ్

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురు నాయకులను సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ), స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్‌ఈసీ) మెంబర్స్‌గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లుగా దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి (కమలాపురం), డీసీ గోవిందరెడ్డి (బద్వేలు) ఉన్నారు.

స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్‌ఈసీ) మెంబర్లు

రాజోలి వీరారెడ్డి (కమలాపురం), మాసీమ బాబు (కమలాపురం), వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి (బద్వేలు), ఎంపీ రాజారామ్ (ప్రొద్దుటూరు), సిద్దవటం యానాదయ్య (కడప), డాక్టర్ సొహైల్ షేక్ అహ్మద్ (కడప), కాశీభట్ల సత్యసాయినాథశర్మ (కమలాపురం), నల్లేరు విశ్వనాథరెడ్డి (బద్వేలు)ని నియమించారు.

గాంధీ మార్గం ఆదర్శనీయం

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్‌రోడ్స్: అహింస, శాంతి, స్నేహ భావాలు మానవత్వాన్ని పరిమళింపజేస్తాయని, ప్రపంచానికే ఆదర్శవంతమైన గాంధీ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు అధ్యక్షతన మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎస్డీసి వెంకటపతి,మెప్మా పీడీ కిరణ్ కుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా,ఇతర శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో తదితరులు

ప్రాణాలతో చెలగాటం!

- తెలుగుతమ్ముళ్ల నేతృత్వంలో కల్తీ మద్యం నెట్‌వర్క్
- అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా తెరపైకి వస్తున్న వైనం
- నాడు రైల్వేకోడూరు, నేడు తంబళ్లపల్లెలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు
- పుట్టపర్తి, కడప, అన్నమయ్య జిల్లాలకు నకిలీ మద్యం సరఫరా



తంబళ్లపల్లె నియోజకవర్గంలో పట్టుబడ్డ నకిలీ మద్యం తయారీ కేంద్రం

సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికలకు ముందు నాణ్యమైన మద్యం...సరసమైన ధరల్లోనే ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ రివర్స్ అయ్యింది. విచ్చలవిడి మద్యం షాపులు, వాటికి అనుసంధానంగా బెల్టు షాపులు యథాతథం కాగా...ఇప్పుడు కల్తీ మద్యం దందా నడుస్తోంది. కేవలం స్పిరిట్‌తో తయారీ చేసిన నకిలీ మద్యంతో మందు బాబుల గొంతులు తడుపుతున్నారు. అందు కోసం తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో ప్రత్యేకంగా తయారీ కేంద్రాలు కూడా వెలిశాయి. గత జనవరి-ఫిబ్రవరి మాసాల్లో స్పిరిట్‌తో మద్యం తయారీ కేంద్రాలు వెలుగులోకి రాగా, తాజా శుక్రవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె కేంద్రంగా టీడీపీ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి కనుసన్నుల్లోని నకిలీ మద్యం తయారీ కేంద్రం పట్టుబడింది.

- ఇప్పటికే రూ.90 క్వార్టర్ ఇచ్చే మద్యంపై అనేక అనుమానాలుంటే...తాజాగా కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం దందా ప్రారంభమైంది. కేవలం స్పిరిట్‌తో మద్యం తయారు చేస్తూ మందు బాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎన్నికలకు ముందు నాణ్యమైన మద్యం అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మాట దేవుడెరుగు... ఇప్పుడు కల్తీ మద్యాన్ని అరికట్టలేని పరిస్థితికి కూటమి సర్కార్ వచ్చేసింది. కూటమి నేతల కనుసన్నల్లోనే ఈ వ్యాపారం సాగుతుందనేది బహిరంగ రహస్యంగా ఉండేది. తాజాగా తంబళ్లపల్లె నకిలీ మద్యం తయారీ కేంద్రంతో వ్యవహారం బట్టబయలయ్యింది.

లోతైన విచారణకు పాతర...

కల్తీ మద్యం కోసం తిరుపతి కేంద్రంగా పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నట్లు అప్పట్లో తెరపైకి వచ్చింది. ఈ విషయం ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలిసినా బడాబాబుల పేర్లు బయటకు రాకుండా అనామకులను కేసులో పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెలుగు చూశాయి. తిరుపతి, రైల్వేకోడూరుతో పాటు రాజంపేటలోనూ ఈ నకిలీ మద్యం తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు చేశారు. దీంట్లో ఒకరిద్దరిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఈ రాకెట్ వెనుక ఎవరున్నారు..? కేరళ నుంచి స్పిరిట్ ఎవరు తెప్పిస్తున్నారు..? లేబుళ్లు, స్టిక్కర్లు ఎక్కడ తయారవుతున్నాయనే కోణంలో మాత్రం స్పష్టత లేకుండా పోయింది. అప్పట్లో లోతైన విచారణకు పాతరేశారు. రాజంపేట తయారీ కేంద్రాన్ని గుర్తించినప్పుడు తమకు కావాల్సిన వారి పేర్లు బయటకు రాకుండా ఉండటం కోసం తిరుపతికి చెందిన ఓ నేత రోజంతా రాజంపేట అధికారుల చుట్టూనే తిరిగినట్లు సమాచారం.

- తంబళ్లపల్లె కేంద్రంగా టీడీపీ నేత జయచంద్రారెడ్డి సన్నిహితులు తయారు చేస్తున్న నకిలీ మద్యం దందా వ్యవహారం పుట్టపర్తి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలకు విస్తరించినట్లు తెలుస్తోంది. బ్రాండెడ్ లేబుళ్లు, బాటిళ్లతో నకిలీ మద్యం తయారీ చేసి మద్యం షాపులకు చేరవేసి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కాగా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, రామప్రసాద్‌రెడ్డిలతో జయచంద్రారెడ్డికి సన్నిహిత సంబంధాలు కారణంగా కేసు నుంచి తప్పించేందుకు రాజకీయ పైరవీలు ఆరంభమైనట్లు సమాచారం.

జంకుతోన్న ఎక్సైజ్‌శాఖ

వైఎస్సార్ కడప జిల్లాలో అధికారపార్టీ నేతల నోటి దూలకు ఎక్సైజ్‌శాఖ జంకుతోంది. అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో అనధికారిక మద్యం షాపులు వెలిశాయి. ముఖ్యంగా ప్రొద్దుటూరు, కమలాపురం, వీఎన్‌పల్లె, యర్రగుంట్ల బ్రాందీషాపుల నిర్వాహకులతో సంబంధం లేకుండా బంకులు ఏర్పాటు చేసి మద్యం షాపులను కొనసాగిస్తున్నారు. అధికారికంగా నిర్వహిస్తున్న మద్యం షాపుకు చెంతలోనే తెలుగుతమ్ముళ్ల అక్రమంగా మద్యం షాపులను కొనసాగిస్తున్నారు. నియంత్రించే దిశగా ఎక్సైజ్‌శాఖలో అడుగులు పడడం లేదు. ఓవైపు కల్తీ మద్యం మరోవైపు విచ్చలవిడి బెల్ట్‌షాపులతో తమ్ముళ్లు ఎక్సైజ్‌శాఖ యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



- ముగిసిన ఖరీఫ్ పరీక్ష
- ఫలితం నష్టం..
- మద్దతు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- దిగాలుపడ్డ కర్షక లోకం

తలపాగా నెత్తిన చుట్టి..
కాడిని భుజానెత్తి..
రెక్కల్ని ముక్కలుగా చేసి దుక్కి దున్నినా..
ఆశల మోసులు మొలకెత్తలేదు!
పొలం ముంగిటే కాపుకాసినా..
ఒంట్లోని చెమట చుక్కల్ని
నేల చిందించినా..కలల ఫలం దక్కలేదు!

ఆరంభంలో ఊరించిన వాన చినుకులే..
ఆపై ఉసూరుమనిపించి
కంట కునుకే లేకుండా చేశాయి.
ఆఖరి(ఫ్)కి అన్నదాత కంట
కన్నీళ్లే ఒలికించాయి..

అంతో ఇంతో పంట చేతికందే వేళ..
మద్దతు ధర పాతాళానికి పడిపోతే..
సాగు భారం కాక.. హారమవుతుందా!

ఆశల ఉల్లి.. చేలోనే కుళ్లిపోయింది..
అరటికి ధరే లేకుండా పోయింది..
చేమంతి చేజారి వాడిపోయింది..

ఆదుకోవాల్సిన పాలకులే
కర్షకుడిపై చిన్నచూపు చూస్తే..
కల్లబొల్లి కబుర్లతోనే కాలం గడిపేస్తే..
అన్నదాత కడుపు కాలదా!
పండించిన పంట నేలపాలవదా!

ఈ ఏడు ఖరీఫ్‌లోనూ రైతన్నకు..
నష్టమే పలకరించింది.. ప్చ్...
ఆశల స్థానంలో అప్పే మిగిలింది...

– కడప అగ్రికల్చర్



మద్దతు లేక తల్లడిల్లిన ఉల్లి..

16,600 సాగైన పంట.. (ఎకరాల్లో)

సాగు ఖర్చు (ఎకరాకు.. రూ. వేలు) 70 - 80

50 - 70 దిగుబడి (క్వింటాల్)

మద్దతు ధర (రూ.లలో) 700 - 800

45 - 50 నష్టం.. (ఎకరాకు.. రూ. వేలల్లో)

కోటి ఆశలతో రైతులు ఖరీఫ్‌లో ఉల్లి పంట సాగు చేశారు. సేద్యాలు, విత్తనాలు, సత్తువులు, ఎరువులు, పురుగుముందులంటూ వేలకు వేలు ఖర్చుచేశారు. అతివృష్టి..అనావృష్టి కారణంగా అనుకున్న దిగుబడి రాలేదు. ధర చూస్తే పాతాళానికి పడిపోయింది. క్వింటాల్ రూ. 7 వందలకు అమ్మితే సాగు ఖర్చులు కూడా రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వానికేమో రైతంటేనే గిట్టదు..మద్దతు ధర పెంచమంటే పెంచదు. ఉల్లి రైతులు ఈ ఏడాది నష్టాలను మూటగట్టుకున్నారు.



చేతికి చిక్కని చీనీ..

39,402 సాగైన పంట.. (ఎకరాల్లో)	40 - 50 ఖర్చు (ఎకరాకు..రూ.వేలు)
10 - 15 దిగుబడి (ఎకరాకు..టన్నుల్లో)	20 - 30 మద్దతు ధర (టన్ను.. రూ.వేలల్లో.).

చీనీ పంట ఎకరాకు సేద్యం, మొక్కలు, డ్రిప్పు మెయింటెనెన్స్ 50 వేలు ఖర్చు అవుతుంది. నాటిన 3 నుంచి 5 ఏళ్లలో కాపు వస్తుంది. అంతవరకు మెయింటెనెన్స్ ఖర్చులు వస్తాయి. ప్రస్తుత ధరకు అన్ని ఖర్చులు పోను ఆడికాడికే మిగులుతుంది. దీనికి కూడా ప్రకృతి వైపరీత్యాల ప్రమాదం ఉంటుంది. గండాలన్నీ దాటుకుని వస్తే రైతులకు కాస్తోకూస్తో మిగులుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టన్ను 70 వేలకుపైనే ఉండేదని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఆపరిస్థితి లేదని రైతులు వాపోయారు.

టమోటా.. నష్టాల మూటే!

999.97 సాగైన పంట.. (ఎకరాల్లో)	85 - 95 ఖర్చు.. (ఎకరాకు.. రూ. వేలు)

టమోట పంట పరిస్థితీ అదే. ఒక ఎకరాసాగుకు సేద్యం, టమోటనారు, కూలీలు, పురుగుమందులు, ఇతర ఖర్చులు కలుపుకుని లక్షకు పైనే ఖర్చు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం కిలో రూ. 10 నుంచి 15లు పలుకుతోంది. ఈ ధరలతో రైతుకు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. నిలకడ లేని ధరలు, తెగుళ్లతో టమోట రైతులకు లాభాల మాట దేవుడెరుగు నష్టాలే మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





1321 సాగైన పంట.. (ఎకరాల్లో)	20 - 30 ఖర్చు.. (ఎకరాకు.. రూ.వేలు)

వాడిన చేమంతులు

చామంతి పంట సాగు ఎకరాకు రూ. 20 నుంచి రూ. 30 వేల వరకు ఖర్చు వస్తుంది. ఇది దాదాపు మూడు నెలలపాటు కాపుకాస్తుంది. దసరా పండుగ సీజన్‌లో కిలో రూ. 100 పోతుంది. ఇదే ధర కొనసాగితే ఎకరాకు 3 నుంచి 4 లక్షల వరకు వస్తుంది. ధర పడిపోతే ఎకరాకు లక్ష కూడా రాదు. దీని లాభనష్టాలు ధరల బట్టి ఉంటుంది.

ఆదుకోని అరటి...

ఆరటి రైతులది మరో వ్యథ. దుక్కులు మొదలు ఆరటి పిలకలు, డ్రిప్పు, ఆపై మెయింటెన్స్ కలుపుకుని ఎకరాలకు లక్ష వరకు ఖర్చవుతుంది. నాటిన ఏడాది తరువాత కాపునకు వస్తుంది. ప్రకృతి వైపరీత్యాలను తప్పించుకుంటేనే(గాలులు, తెగుళ్లు, అధిక వర్షాలు) రైతుకు అంతో ఇంతో మిగులుతుంది. తీరా పంట చేతికొచ్చే వేళ ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. టన్ను రూ. 12 –15 వేలు ఉంటే ... గత ప్రభుత్వంలో టన్ను ధర రూ. 20 నుంచి రూ. 30 వేలు ఉండేదని రైతులు తెలిపారు.



20231 సాగైన పంట.. (ఎకరాల్లో)	1,50,000 ఖర్చు.. (ఎకరాకు..రూ.లలో)
25 - 30 దిగుబడి (టన్నుల్లో.. ఎకరాకు)	12 - 15 ప్రస్తుత మద్దతు ధర (రూ. వేలు..టన్నుకు)



25,000 వైఎస్సార్ సీపీ హయాంలో మద్దతు ధర (రూ.లలో..టన్నుకు)

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీనాథ్ (ఫైల్)

తొండూరు : మండలంలోని మల్లేల గ్రామానికి చెందిన దొడ్డి శ్రీనాథ్ (28) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనాథ్ తాను చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక తీవ్ర ఆవేదనకు లోనై చివరికి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు గుండె లవిసేలా రోదించారు. శ్రీనాథ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

లారీ కాలి డ్రైవర్ సజీవ దహనం



కాలిపోయిన లారీని క్రేన్ ద్వారా పక్కకు తొలగిస్తున్న దృశ్యం

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో మండలంలోని ఓబుళాపురం సమీపంలో లారీ కాలిపోయి డ్రైవరు సజీవ దహనమయ్యాడు. ఏఎస్ఐ రమేష్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 1వతేదీన రాత్రి కృష్ణపట్నం నుంచి బొగ్గులోడుతో లారీ హోస్పేట్‌కు వెళ్తోంది. ఓబుళాపురం సమీపంలో లారీ అదుపుతప్పి పక్కనే వున్న కల్వర్టులోకి పడిపోయింది. అంతలోనే లారీలో మంటలు చెలరేగాయి. దీంతో లారీలోనే ఇరుక్కుపోయిన డ్రైవరు సంజీవ్(32) అగ్నికి ఆహుతయ్యాడు. రెండు అగ్నిమాపక యంత్రాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. మృతి చెందిన డ్రైవరు సంజీవ్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన బుగ్గలమారి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి శుక్రవారం పలు శుభ కార్యాల్లో పాల్గొన్నారు. గత నెల 29వ తేదీన 21వ వార్డు కౌన్సిలర్ సోకే వెంకటరమణ (కోడిరమణ) కుమారుడు వంశీ వివాహం శశికళతో జరిగింది. శుక్రవారం వైఎస్ భారతమ్మ తన సోదరుడు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వైఎస్ ప్రమీలమ్మతో కలిసి కోడి రమణ నివాసానికి చేరుకుని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. - పులివెందుల



పులివెందుల వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగాపురం మధుసూదన్‌రెడ్డి కుమార్తె వాణి వివాహం చరణ్‌కుమార్‌రెడ్డితో కదిరి రోడ్డులోని ఎస్వీఎస్ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి, డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ మధుసూదన్‌రెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్

– ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్స్



గంగయ్య కుటుంబ సభ్యులతో పోలీసులు

ఎర్రగుంట్ల : ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని పోలీసులు కాపాడి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్య కాలనీలో కొవ్వూరు గంగయ్య నివాసం ఉంటున్నారు. అయితే ఆయన వ్యక్తిగత కారణాల వల్ల హనుమనుగుత్తి గ్రామానికి వెళ్లే దారిలో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా.. అదే సమయంలో అక్కడికి పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అల్ఫ్రెడ్, కానిస్టేబుల్ కాశయ్య వెళ్లారు. సంఘటనను గమనించి వెంటనే గంగయ్య ఆత్మహత్య చేసుకోకుండా అడ్డుకున్నారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌కు కుటుంబ సభ్యులను పిలిపించి ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజారెడ్డి కూడా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– ముగ్గురికి గాయాలు



మృతి చెందిన దేవేంద్రారెడ్డి, గాయపడిన వీరకుమార్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని యన్ పాలగిరి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడు ప్రమాదంలో రామిరెడ్డి దేవేంద్రారెడ్డి(19) మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేంపల్లె మండలం ముతుకూరు గ్రామానికి చెందిన ఆసం వీరకుమార్‌రెడ్డి, రామిరెడ్డి దేవేంద్రారెడ్డి కలిసి డీజిల్ కోసం.. బైక్‌లో వీరపునాయునిపల్లెకు వెళ్తున్నారు. అటు వైపు నుంచి వేముల మండలం నారెపల్లెకు చెందిన అన్నా చెల్లెళ్లు జంపల భార్గవ్‌రెడ్డి, ప్రవళిక స్కూటీలో ప్రొద్దుటూరు దసరాకు వెళ్లి తిరిగి నారెపల్లెకు పయనమయ్యారు. యన్ పాలగిరి గ్రామ సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టడంతో.. ఎదురుగా వస్తున్న స్కూటీకి తగలడం వల్ల ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో దేవేంద్రారెడ్డి మృతి చెందాడు. గాయాల పాలైన మిగిలిన ముగ్గురిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసం వీరకుమార్‌రెడ్డి తీవ్ర గాయాలు కావడంతో.. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. మృతుడి తండ్రి రామిరెడ్డి గంగిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు చేయూత



ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు

కడప అగ్రికల్చర్ : రైతులకు ఆర్థిక చేయూతనిచ్చే లక్ష్యంతో వ్యవసాయ పరికరాలపై వస్తు, సేవల పన్ను తగ్గించినట్లు డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. వ్యవసాయ పరికరాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపుపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం కడప నగరంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. ఈ తగ్గింపు ప్రధానంగా వ్యవసాయ ట్రాక్టర్లు, విడిభాగాలు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు, వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, ఆక్వాకల్చర్ పరికరాలు, పాల క్యాన్లు, 12 రకాల బయో పెస్టిసైడ్ వంటి వివిధ రకాల వస్తువులకు వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతోపాటు కడప, సికెదిన్నె, ఖాజీపేట, చెన్నూరు, పెండ్లిమర్రి, ఒంటిమిట్ట ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

చాపాడు : మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని చాపాడు మండలం కేతవరం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతవరానికి చెందిన పందిటి వరప్రసాద్ (71) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పందిటి వరప్రసాద్ బహిర్భూమి కోసం రోడ్డు దాటుతుండగా ఇదే క్రమంలో ప్రొద్దుటూరు నుంచి మైదుకూరుకు వెళుతున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రోడ్డు ప్రమాదానికి కారణమైన బైక్ నడిపే వ్యక్తి ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

కడప అర్బన్ : శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా మారాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం కడప నగర శివార్లలోని పురుషుల కేంద్ర కారాగారంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో బోర్డ్ ఆఫ్ విజిటర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్ జడ్జి యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి బాబా ఫక్రుద్దీన్‌తోపాటు పలువురు న్యాయమూర్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్ జడ్జి యామిని మాట్లాడుతూ చదువుకోవడానికి ఆసక్తి ఉన్న ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సాయం అందిస్తామన్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం జైలు పరిసరాలు, వంటగదులు, వసతి గదులు, టాయిలెట్లు, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి కె.రాజేశ్వరరావు, మహిళా కారాగారం పర్యవేక్షణ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సివిల్ సర్జన్ నవీన్, బోర్డ్ ఆఫ్ విజిటర్స్ మీటింగ్ సభ్యులు, ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమానికి కృషి

ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన (గురువారం) మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును పురుషుల కేంద్రం కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున ఖైదీల దినోత్సవంగా కూడా జరుపుకొంటారన్నారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఖైదీలకు ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కడప రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, వన్ స్టాప్ సెంటర్ సైకాలజిస్ట్ సునీత, దాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎన్జీవో ఓబుల్ దాస్, పారా లీగల్ వాలంటరీలు సురేష్ సహాయం, ఎన్జీవో హారూన్, జైలర్లు, వైద్య సిబ్బంది, ఎన్జీవోలు పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. కడప నగర శివారులోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 2025 డీఎస్సీ ఎస్‌జీటీ(నూతన ఉపాధ్యాయులు)లకు శిక్షణ కార్యక్రమాన్ని విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కోర్సు డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ఓవరాల్ ఇన్‌చార్జి వీరేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం జాబ్‌చార్టు, విధివిధానాలు వివరించారు. అనంతరం డీఆర్‌పీలు నూతన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు, ప్రథం డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ కిరణ్, ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్(జిల్లా అబ్జర్వర్) డాక్టర్ రామకృష్ణ, డైట్ ప్రిన్సిపాల్ కేదార్‌నాథ్, ఎంఈఓలు రఫిక్ జాన్, సుభాషిణి, వెంకటేశ్వర్లు, సమగ్రశిక్ష అసిస్టెంట్ ఏఎస్‌ఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యారీ ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రంగాపురం గ్రామ సమీపంలో ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల వద్ద క్యారీ ఆటో బోల్తా పడిన సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా బత్తలపల్లి తాలూకాలోని లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన సాకే నాగరాజు కుటుంబ సభ్యులు మొక్కుబడి తీర్చుకునేందుకు కడప జిల్లాలోని పొలతలకు వెళ్తుండగా.. రంగాపురం గ్రామ సమీపానికి రాగానే ఆటో టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సాకే సావిత్రమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ, పూజిత, పెద్దన్నతోపాటు మరో ముగ్గురికి స్వల్పగాయాలు అయ్యాయి. చికిత్స కోసం వారిని 108 అంబులెన్స్‌లో కడప రోడ్డులో ఉన్న సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హాజీవలి తెలిపారు.

దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వే వంతెన



పెన్నానదిపై నిర్మించిన లోలెవల్ వంతెన దెబ్బతిన్న దృశ్యం

సిద్దవటం : సిద్దవటంలోని పెన్నా నదిపై నిర్మించిన లోలెవల్ వంతెన గత కొంత కాలంగా ప్రవహిస్తున్న వరద నీటి కారణంగా దెబ్బతింది. ఆగస్టు నుంచి ఇటు కుందూ నదినీరు, వర్షాల కారణంగా వచ్చిన వరదనీటితో.. దాదాపు 2 నెలల నుంచి పెన్నానది లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పెన్నానది లోలెవల్ వంతెనపై నుంచి సిద్దవటం గ్రామానికి రూ.4 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో స్కీం వాటర్ పైపులైన్ ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహానికి గురువారం ఒక్కసారిగా పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే కుంగిపోయింది. వంతెనపై ఏర్పాటు చేసిన వాటర్ పైపులైన్ కూడా దెబ్బతినే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెన్నానది లోలెవల్ వంతెనకు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఒంటిమిట్టలో వైభవంగా శమీవృక్ష పూజ



ఒంటిమిట్టలో స్వామి, అమ్మవారి గ్రామోత్సవం



జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న వేద పండితులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామికి గురువారం విజయదశమి సందర్భంగా ఆలయ అర్చకులచే టీటీడీ అధికారులు వైభవంగా శమీ వృక్ష పూజ నిర్వహించారు. ముందుగా ఆలయంలోని సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు, పుష్పమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారిని రామాలయం నుంచి ఊరేగింపుగా తీసుకొని వచ్చి, శృంగిశైలిపై ఉన్న ఆస్థాన మండపంలో ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ఆరాధన, చతుర్వేద పారాయణం, శమీ వృక్ష పూజ, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ మూర్తులు గ్రామోత్సవానికి బయలుదేరి, పురవీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. తమ ఇంటి వద్దకు వచ్చిన శ్రీరాముడికి భక్తులు కాయాకర్పూరం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఆలయ విజిలెన్స్ అధికారి గంగులయ్య, ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తి

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి పి.టి ఆశా శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఆమెకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె కాసేపు ఆలయ రంగమండపంలో సేద తీరారు. ఆమెను అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గాంధీ ఆశయాలకు తూట్లు పొడిచేలా కూటమి పాలన



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : మహాత్మా గాంధీ ఆశయాలకు తూట్లు పొడిచేలా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అహింస, సత్యం, ధర్మం అనే ఆయుధాలతో గాంధీజీ భారతదేశానికి స్వాతంత్య్రం తెచ్చారని, కూటమి ప్రభుత్వం హింస, అసత్యాలు, అధర్మంతో పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించకూడదనే అహంభావంతో.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ జైలుపాలు చేస్తున్నారన్నారు. దళితులు, గిరిజనులు, బహుజనులు, మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ, వారి ఆస్తులు, భూములను లాక్కుంటున్నారన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడానికి గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి, 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి పరిపాలనను ప్రజల వద్దకు చేర్చారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేసి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. గాంధీ కలలుగన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు యానాదయ్య, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, పార్టీ నాయకులు సీహెచ్ వినోద్, బండి ప్రసాద్, క్రిష్ణమూర్తి, పవర్ అల్తాఫ్, బసవరాజు, షఫీవుల్లా, గురుప్రసాద్, కె.శివయాదవ్ పాల్గొన్నారు.